క్లుప్తంగా

కల్యాణం..కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిల కల్యాణం కమనీయంగా సాగింది. స్వామిఅమ్మవార్లకు ఉదయం అభిషేకం, సుప్రభాతం, పూలంగిసేవ నిర్వహించారు. ఉదయం 10.30కి స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండపంలో ఉంచి కల్యాణం జరిపించారు. కల్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

నేడు ఆత్మీయ సమావేశం

రాపూరు: మండలంలోని వేపినాపి సమీపంలోని పోతుకొండ అంకమ్మతల్లి ఆలయం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో జరిగే ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, నేత పాపకన్ను మధుసూదన్‌రెడ్డి కోరారు, మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



విద్యార్థినులకు కిట్లను అందజేస్తున్న ఎల్లసిరి

గూడూరు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు ఎల్లసిరి, ఆడిటర్ కంతి రామ్మోహన్‌రావుల దాతృత్వంతో స్పోర్ట్స్ కిట్స్‌ను శనివారం వారు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం, పీడీలు మాధవిలక్ష్మి, విజయలక్ష్మి ఎల్లసిరి, రామ్మోహన్‌లను ఘనంగా సత్కరించారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయాలి

చిల్లకూరు: ఐదేళ్లలోపు పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ హనుమంతరావు ఆదేశించారు. చిల్లకూరులోని వడ్డిపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆయన తనిఖీ చేశారు. అక్కడ వ్యాక్సినేషన్ వైద్య సిబ్బందితో మాట్లాడారు. అనంతరం కేంద్రంలోని పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన బిడ్డలు సహా ఐదేళ్లలోపు పిల్లలకు తల్లిదండ్రులు తప్పక టీకాలు వేయించాలని అన్నారు. ఆయన వెంట చిల్లకూరు వైద్యులు సయ్యద్ షాలోమ్ అరాఫత్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్, ఫార్మసిస్ట్ ఉమాపతి, పర్యవేక్షకులు రవికుమార్, సిబ్బంది సలీమాబేగం, షాబీరా, పెంచలమ్మ, మహిళా పోలీస్ శాంతి పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి మూల్యం చెల్లించుకోవాల్సిందే!



రికార్డులను పరిశీలిస్తున్న గోపాలరావు

వెంకటగిరి: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వెంకటగిరి పౌరసరఫరాలశాఖ గోదాము డిప్యూటీ తహసీల్దార్ సందీప్‌ను విధుల నుంచి తొలగించినట్టు తిరుపతి జిల్లా పౌరసరఫరాలశాఖ కార్యాలయ మేనేజర్ గోపాలరావు శనివారం తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక పౌరసరఫరాలశాఖ గోడౌన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోడౌన్ నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేయడంలో ఆలస్యం చేస్తున్న కారణంగా డీటీ సందీప్‌ను విధుల నుంచి తొలగించి నాయుడుపేట గోడౌన్ డీటీ వెంకటేశ్వరరావును ఇన్‌చార్జ్‌గా నియమించినట్టు తెలిపారు. గోడౌన్‌లో సరుకుల వివరాలను తనిఖీ చేస్తున్నామని, నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.

స్కూటీని ఢీకొన్న లారీ

- తల్లీకూతురికి తీవ్ర గాయాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని పండ్లూరు కూడలి వద్ద శనివారం లారీ స్కూటీని ఢీకొంది. స్కూటీలో వెళుతున్న గూడూరు కోర్టు సెంటర్ ప్రాంతానికి చెందిన తల్లీకూతుర్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు తెలిపిన మేరకు వివరాలు.. గూడూరు కోర్టు సెంటర్ ప్రాంతానికి చెందిన కె.సుప్రజ, ఆమె తల్లి కె.శోభారాణితో కలిసి స్కూటీలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో పండ్లూరు జాతీయ రహదారి కూడలి మలుపు వద్ద నెల్లూరు వైపు వెళుతున్న లారీ వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. దీంతో సుప్రజతో పాటు శోభారాణి తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ వీరిని మెరుగైన వైద్యం కోసం వారిని నెల్లూరుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

సొర..కనిపించలేదురా!



పాల సొర చేపలు



రంపపు సొర చేప



ఉలవ సొర చేప



తిమిరి సొర చేప



తెల్ల సొర చేప

- కనుమరుగవుతున్న సొర చేపలు
- అంతరించిపోయే జాబితాలో మొదటి వరుసలో ఉలవ సొర చేప
- పర్యాటకులు,స్టీమ్‌బోట్లతో మృత్యువాత పడుతున్న వైనం
- పర్యావరణానికి ముప్పుతప్పదంటున్న శాస్త్రవేత్తలు

వాకాడు: పూర్వం పుష్కలంగా దొరికే సాగర సొర చేపలు క్రమేపి అంతరించిపోతున్నాయి. ఒకప్పుడు బంగాళాఖాతంలో ఈ సొర చేపలు ఎక్కువగా దొరికేవి. పర్యావరణంలో వచ్చే అనేక మార్పుల కారణంగా సాగర సొర చేపలు రానురాను కనుమరుగవుతున్నాయని పర్యావరణం, వన్యప్రాణి విభాగం అధికారులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడడంలో ఆలీవ్‌రిడ్లీ తాబేళ్లతోపాటు, సొరచేపలు సముద్రంలో కీలక పాత్ర పోషిస్తాయి. అయితే సముద్రంలో వీటికి అనువుగా ఉండే స్థావరాలను పర్యాటకులు, స్టీమ్‌బోట్ల వల్ల అవి తీరానికి వచ్చి మరణిస్తున్నాయి. సముద్ర సొర చేపల్లో ఆరు రకాలు ఉన్నాయి. తెల్ల, పాల, కుండ, రంపపు, ఉలవ, తిమిరి సొరచేపలు ఉన్నాయి. ఇవి పూర్తిగా అంతరించిపోకుండా ఉండేందుకు 1972 వన్యప్రాణి రక్షణ చట్టం కింద సొర చేపలు వేటాడడం, తినడం నిషేధించారు. సొర చేపలు ఏడాదికి రెండు పిల్లలను మాత్రమే గుడ్లుపెట్టి కంటాయి. వాటిని తల్లి సంరక్షణలో ఉంచుకుంటాయి. ఒక సంవత్సరం పాటు తల్లి వెంటే తిప్పుకుంటాయి. మన ప్రాంతంలో ఎక్కువగా పాల సొరచేపలు కనిపించేవి. ఈ పాల సొర చేపలను సార్క్ అని కూడా పిలుస్తారు. చట్టప్రకారం వీటిని తినడం, వలపన్ని పట్టినా షెడ్యూల్-1, పార్ట్ 2ఏ ప్రకారం చట్టరీత్యా నేరమని వన్యప్రాణి అధికారులు తెలియజేస్తున్నారు. పాల సొర చేపలు బంగాళాఖాతం సముద్రంలో ఎక్కువగా ఉంటాయి. పాల సొరచేప 200 నుంచి 500 కిలోలు బరువు పెరుగుతుంది. సముద్రంలో 20 కిలోమీటర్ల లోతులోనూ ఈదగల శక్తి వీటికి ఉంటుంది. సముద్రంలో పడిన వ్యర్థ జలాలను వేటాడడంలో గంటకు 30 కిలోమీటర్ల వేగంతో పయనిస్తాయి. అంతేకాకుండా కుండ సొర చేపగా పిలవబడే ఈ చేప ఎక్కువగా పసిఫిక్ మహాసముద్రంలో కనిపిస్తాయి. ఈ సొరచేపలు 20 నుంచి 30 ఏళ్ల వరకు జీవిస్తాయి. అలాగే మరో రకం రంపపు సొరచేప. ఈ రకం సొర చేపలు అరేబియా సముద్రంలో ఎక్కువగా దొరుకుతాయి. ఇవి శత్రువులను రాకను పసిగట్టి ఎదుర్కొని వాటిని అవి కాపాడుకుంటాయి. అండమాన్ పోర్టు బ్లెయిర్‌లోనూ కనిపిస్తాయి. వీటికి అడ్డు వచ్చిన వాటిని కోసుకుంటూపోతాయి. ఉలవ సొరచేప బంగాళాఖాతంలో దొరికేవి. ఇప్పుడు అవిపూర్తిగా అంతరించే పోయే దశలో ఉన్నాయి. తిమిరి అనే జాతికి చెందిన చేపకు శరీరమంతా కరెంటు ఉత్పత్తి అవుతుంది. దీనిని ముట్టుకుంటే షాక్ కొడతాయి. అందువల్ల మత్స్యకారులు తిమిరి చేపలు జోలికి వెళ్లరు. సొర చేపలు సముద్రంలో ఉండడం వల్ల పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయి. అందువల్ల సొరచేపలు అంతరించిపోకుండా ఉండేందుకు మత్స్యకార గ్రామాల్లో సముద్ర రక్షణ కార్యక్రమం ద్వారా ట్రీ ఫౌండేషన్ జీవ పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్నట్లు వన్యప్రాణి విభాగం అధికారులు చెబుతున్నారు.



సముద్రంలో కలుస్తున్న వ్యర్థ జలాలు

సొర చేపలు అంతరించి పోతున్నాయ్



2004లో వచ్చిన సునామీ, ఆ తరువాత వాతావరణంలో వచ్చిన అనేక మార్పుల కారణంగా సముద్రంలో కదలిక ఏర్పడి కొంతమేర సొర చేపలు అంతరించిపోయాయి. అలాగే తీరంలోని పలు పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు నేరుగా సముద్రంలో కలవడంతో పర్యావరణానికి దోహదపడే సముద్ర జీవరాసులు అంతరించిపోతున్నాయి. పర్యావరణాన్ని కాపాడే సొర చేపలు, తాబేళ్లు, డాల్ఫిన్స్ జీవరాసులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వీటిని వేటాడడాన్ని నిషేధించారు.

–చాంద్‌బాషా, మత్స్యశాఖ ఏడీ

175 స్థానాలు గెలిచేలా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

- తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు ఆంధ్ర రాష్ట్రంలో 175కి 175 అసెంబ్లీ స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకునేలా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్‌ఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో రూరల్ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలోని సమస్యలను పరిష్కరించడానికి సచివాలయం, వలంటీర్ వ్యవస స్థాపించి దేశంలోనే ఆదర్శవంతమైన ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. తిరుపతిని బాలాజీ జిల్లాగా చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి కన్న కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చడం, ఆ జిల్లాకే అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తిరుపతి జిల్లా పరిధిలోని 7 నియోజకవర్గల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు పర్వతనేని చంద్రశేఖర్‌రెడ్డి, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్ రెడ్డిల విజయానికి పార్టీ శ్రేణులు కృషిచేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అనంతరం నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ముందుగా రూరల్ నేతల ఆధ్వర్యంలో నేదురుమల్లిని గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, ఎంపీపీ తంబిరెడ్డి తనుజారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు కాల్తిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు టి మస్తాన్, కొండూ రు వెంకటరత్నంరాజు, వైస్ ఎంపీపీలు సుధాకర్, పెంచలయ్య, కౌన్సిలర్లు ఢిల్లీబాబు, చిట్టేటి హరికృష్ణ, నేతలు సదారెడ్డి, శివారెడ్డి, పంజాం ధనంజయ్య, జేసీఎస్ కన్వీనర్ ముళవాయిల వెంకటేశ్వర్లు, తోట గణేష్‌రెడ్డి, రాజేంద్ర, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కండలేరులో 44.164 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం 44.164 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,210క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 100, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిజ్‌కు 50, హైలెవల్ స్లూయిజ్‌కు 140క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు ఆయన వివరించారు.

రోడ్డు పనుల అడ్డగింత

పెళ్లకూరు: జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులను పెన్నేపల్లి వద్ద శనివారం పలువురు బాధితులు అడ్డుకున్నారు. గ్రామంలోని సర్వే నంబర్ 10లో జాతీయ రహదారికి సమీపంలో లేఔట్ స్థలాలు ఉన్నాయి. అయితే లేఔట్‌లో కొంత భాగం రోడ్డు విస్తరణకు కేటాయించారు. దీనికి సంబంధించి పరిహారం చెల్లించకపోవడంతో బాధితులు పనులను అడ్డుకుని నిలిపేశారు. పరిహారం చెల్లించే వరకు పనులు చేయడం సరికాదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితులు మురళినాయుడు, కేశవరెడ్డి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఉచితంగా వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

సైదాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 12రకాల ప్రాణాంతక వ్యాధులకు ఉచితంగానే వ్యాక్సిన్ అందుబాటులో ఉందని నెల్లూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. సైదాపురంలోని పీహెచ్‌సీ పనితీరును శనివారం పరిశీలించారు. అనంతరం దళిత కాలనీలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ వైద్యశాలలో కన్నా నాణ్యమైన వ్యాక్సిన్ ఆరోగ్య కేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచిందన్నారు. ఎలాంటి ఫీజు లేకుండానే నాణ్యమైన వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన తెలిపారు. వైద్యులు జనార్దన్ రావు, శ్రావణి పాల్గొన్నారు.

బొలేరోను ఢీకొన్న కారు

తడ: బొలేరో ట్రక్కుని కారు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన పూడి కుప్పం వద్ద శనివారం జరిగింది. చెన్నై రెడ్ హిల్స్ నుంచి శ్రీసిటీ, ఇసుజు పరిశ్రమకు ట్రక్కులో ఐదుగురు వ్యక్తులు బయలుదేరారు. అదేసమయంలో చెన్నై నుంచి హైదరాబాదుకు వెళుతున్న కారు పూడి కుప్పం వద్ద బొలేరో ట్రక్కును అధిగమించే క్రమంలో అదుపుతప్పి వెనుకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రక్కు రోడ్డు పక్కన బోల్తా కొట్టడంతో ట్రక్కులోని దేవ, సత్యం, ఫజిల్, గోష్ అనే నలుగురు గాయపడ్డారు. కారులోని తండ్రీ కుమారుడు శ్రీధర్, దేవాన్ష్ కూడా గాయపడ్డారు. స్థానికుల సాయంతో వీరిని శ్రీసిటీ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు.

మైనింగ్ పరిశ్రమలపై అవగాహన



గనులను పరిశీలించేందుకు వచ్చిన విద్యార్థులు

సైదాపురం: గిద్దలూరు, ఊటుకూరు, జోగిపల్లి, తలుపూరులోని మైకా పరిశ్రమలపై చెన్నైకి చెందిన ప్రెసిడెన్సీ అటానమస్ కాలేజీకి చెందిన ఎమ్మెస్సీ జియాలజికల్ విద్యార్థులకు శనివారం జిల్లా మైనింగ్ శాఖకు చెందిన ఏడీఎంజీ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. కళాశాల ప్రొఫెసర్లు కరికలన్ పర్యవేక్షణలో మండలంలోని గ్రామాల్లో ఉన్న గనులతో పాటు పౌడర్ ఫ్యాక్టరీలను పరిశీలించారు. విద్యార్థులకు మైనింగ్ యజమానులు గోగినేని భరత్, సురేష్‌రెడ్డి, శివారెడ్డి, ఆనంద్‌బాబు, వీటీఓ విశ్వం అవగాహన కల్పించారు. రాధాకృష్ణ మైన్స్ జీఎం వసంతరావు పాల్గొన్నారు.

కమిషనర్‌పై ఆరోపణలు తగదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

వెంకటగిరి: విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పై పలువురు మున్సిపల్ వర్కర్‌లు ఆరోపణలు చేయడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ బాలయ్య, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, కౌన్సిలర్ ఏ శంకరయ్య తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విధులకు డుమ్మా కొడుతూ జీతాలు తీసుకుంటున్న వారితో పాటు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలన్నారు. తన దృష్టికి వచ్చిన సమస్యలపై తక్షణమే స్పందించే కమిషనర్‌కు సిబ్బంది సహకారం అందించాలని తెలిపారు. కౌన్సిలర్లు ఏ శ్రీనివాసులురెడ్డి, కాసా కృష్ణమూర్తి, నారిశేఖర్, మల్లీశ్వరి, నేతలు కె సతీష్, సురేష్ పాల్గొన్నారు.

జున్ 8 నుంచి చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలు

సూళ్లూరుపేట: స్థానిక చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు జున్ 8 నుంచి 14 వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఐదేళ్లకు ఒకసారి జరిగే బ్రహ్మోత్సవాలను కనీ వినీ ఎరుగని రీతిలో నిర్వహించేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన అన్నారు. గత నెలలో నిర్వహించిన మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని జయప్రదం చేసినందుకు భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి బ్రహ్మోత్సవాలకు సంబంధించి పట్టణ ప్రజలందరిని భాగస్వాములను చేసేందుకు రేపు సోమవారం ఆలయం ఆవరణలో సమావేశాన్ని నిర్వహించి అందరీ సలహాలు, సూచనలను తీసుకుంటామని చెప్పారు. ఈనెల 1న బ్రహ్మోత్సవాలు నిర్వహణ గురించి అమ్మవారిని అనుమతి కోరగా ఆమె అనుమతి ఇచ్చిందని చెప్పారు. దీంతో బ్రహ్మోత్సవాల తేదీలను ప్రకటిస్తున్నామని చెప్పారు. మేనెల 26న తొలిచాటింపు (మూగచాటింపు), జున్ 2న రెండో చాటింపు, 4న అగండలం వెలిగించే కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. జూన్ 15న సుడిమాను దింపుట కార్యక్రమంలో బ్రహోత్సవాలు ముగుస్తాయని బాలచంద్రారెడ్డి తెలిపారు. ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి, పాలక సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, కె.సురేష్ బాబు, ఓ సత్యనారాయణ, బి. సునీత, ఎంఎం పద్మజ, నేతలు జనార్దన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కళత్తూరు శేఖర్‌రెడ్డి, పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆలయ చైర్మన్, పాలక సభ్యులు

విద్యకు అధిక ప్రాధాన్యం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవయ్య, చిత్రంలో శ్యామ్‌ప్రసాద్ రెడ్డి

- ప్రభుత్వం బలపరిచే అభ్యర్థులను గెలిపించండి
- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ప్రభుత్వం బలపరిచే ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. శనివారం ఎమ్మెల్యే కిలివేటి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డితో కలిసి పట్టణంలో ముమ్మరంగా ప్రచారం చేశారు. ముందుగా స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద కిలివేటిని కళాశాలలు, పాఠశాలల కరస్పాండెంట్‌లు, నేతలు, కౌన్సిలర్లు ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. అనంతరం పట్టణంలోని బాలుర, బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, సీడీ రామన్ డిగ్రీ కళాశాల, నాయుడుపేట, పుదూరులోని ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంకా పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల వద్దకు వెళ్లి అక్కడి ఉపాధ్యాయులు, పట్టభద్రులతో కలిసి మాట్లాడారు. సీఎం జగనన్న ఎమ్మెల్సీ అభ్యర్థుల విషయమై ప్రత్యేక దృష్టి సారించి పేర్నాటి చారిటబుల్ ట్రస్టు ద్వారా ఎన్నో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న శ్యాంప్రసాద్‌రెడ్డిని, పట్టభద్రుల తరఫున, విద్యాసంస్థలతో పాటు రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా సామాజిక సేవ చేస్తున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి ఉపాధ్యాయుల తరఫున వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు మాత్రమే వేసి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సీఎం జగనన్న ఆశీర్వాదంతో పట్టభద్రుల తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీలో ఉన్నానని తనను ఆదరించి విజయం చేకూర్చితే తన పరిధిలోని ఉమ్మడి చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో నిరుద్యోగులు, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పట్టభద్రుల బ్యాలెట్ నమూనా రెండవ అభ్యర్థిగా ఉన్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బ్యాలెట్‌లో మూడవ స్థానంలో ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓట్లు వేయాలని కోరారు. పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, చైర్ పర్సన్ కటకం దీపిక, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకట రమణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, నేతలు కామిరెడ్డి రాజారెడ్డి, బైనా మల్లికార్జునరెడ్డి, కలికి మాధవరెడ్డి, హరిరెడ్డి, కె.చెంచయ్య, రత్నశ్రీ, సిద్దయ్య, దారా రవి, చదలవాడ కుమార్, ఎస్‌సీఆర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



పెళ్లకూరులో ప్రచారం చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ



కోటలో ప్రచారం చేస్తున్న నేతలు



ప్రచారంలో బత్తిని విజయ్‌కుమార్

పెళ్లకూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డిలకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. శనివారం చావలి, చెంబడిపాళెం, పెళ్లకూరు, కొత్తూరు గ్రామాల్లో పర్యటించి ఉపాధ్యాయ, పట్టభద్రులను కలిసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేయలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, నేతలు రఘు నాయుడు, సతీష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలి..

ఓజిలి: ఓజిలి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో వైఎస్సార్సీపీ నేతలు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. చంద్రశేఖర్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయులను కలిసి కరపత్రాలను శనివారం పంపిణీ చేశారు. అలాగే కురుగొండ గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ నేతలు ముమ్మడి సుబ్బారావు, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, రమణారెడ్డి, ఎంపీటీసీ ఫకీరయ్య, నరేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వాకాటి రమణారెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి..

కోట: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా శనివారం కోటలో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉప సర్పంచ్ గాదిభాస్కర్ పాల్గొన్నారు.

పేర్నాటి, పర్వతరెడ్డి గెలుపునకు కృషి చేయండి

గూడూరు: పేర్నాటి, పర్వతరెడ్డి గెలుపునకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని వైఎస్సార్‌సీపీ నేత బత్తిని విజయ్‌కుమార్ కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం ఆయన ముమ్మర ప్రచారం చేశారు. వారిద్దరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. దాసరి వెంకటేశ్వర్లు, దామోదర్, అజీజ్, వెంకటేశ్వర్లు, రాఘవ రెడ్డి, కిరణ్‌కుమార్, సురేంద్రబాబు, హేమబిందు పాల్గొన్నారు.

మహిళలు ఉన్నతంగా ఎదగాలి



మాట్లాడుతున్న జడ్జి సుల్తానాబేగం



అవగాహన కల్పిస్తున్న జడ్జి భరత్‌కమల్



మాట్లాడుతున్న జడ్జి అనూష

గూడూరు: నేటి బాలికలే రేపటి మహిళలని, మీరంతా బాగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని 7వ అదనపు జిల్లా జడ్జి షమ్మీపర్వీన్ సుల్తానాబేగం పేర్కొన్నారు. రెండవ పట్టణంలోని స్వర్ణాంధ్ర భార తి జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జ్యోతీబాయ్ పూలేను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ పి.లోకనాథం మాట్లాడుతూ మహిళలు ఒక లక్ష్యాన్ని ఎన్నుకుని, సాధించేదాకా ముందుకెళ్లాలని కోరారు. న్యాయవాది కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ సింధు, పీఎల్‌వీ రామసుబ్బయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

కోట: చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కోట జూనియర్ సివిల్‌జడ్జి భరత్‌కమల్ అన్నారు. కొత్త పాళెం గ్రామంలో శనివారం న్యాయవిజ్ఞాన చైతన్య సదస్సు జరిగింది. జడ్జి హాజరై మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ సాధికారత సాధించాలని కోరారు. నేదురుమల్లి హరీష్‌చంద్రారెడ్డి, శ్రీశంకర్‌రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

వెంకటగిరి: మహిళలకు రక్షణగా ఉన్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వెంకటగిరి జూనియర్ సివిల్‌జడ్జి ఓ.అనూష తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో అంతర్జాతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ప్రస్తుతం అన్నిరంగాల్లో రాణిస్తున్నారని, అయినప్పటికీ నేడు మహిళలు కొన్నిచోట్ల వివక్షకు గురవుతున్నారని తెలిపారు. తల్లిదండ్రులు ఆడబిడ్డల పెంపకంలో వారిని అప్రమత్తం చేసి చైతన్యవంతులగా తీర్చిదిద్దాలని తెలియజేశారు. న్యాయవాదులు ఏ.గాంధీ, ఎస్.రాజేష్, రాంప్రసాద్, ప్రియ, సునీత పాల్గొన్నారు.

పోలీసులకు అనుమానితుడి అప్పగింత

నాయుడుపేటటౌన్: పట్టణంలోని దేవత రైస్ మిల్లు సమీపంలో చిన్నపాటి గుడారాలు వేసుకుని ఉన్న వలస కార్మికుల సెల్‌ఫోన్లు అపహరించుకుని వెళుతున్నాడని ఓ అనుమానితుడిని పట్టుకుని శనివారం పోలీసులకు అప్పగించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో వాటర్‌పైప్ లైన్ పనులు చేసేందుకు గుంటూరు జిల్లా నుంచి వచ్చిన వలస కూలీలు దేవత రైస్ మిల్లు సమీపంలో గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. రాత్రి సమయల్లో గుర్తు తెలియని వ్యక్తులు వారి సెల్‌ఫోన్‌లను అపహరించుకుని పోతుండడంతో కాపుకాచి తెల్లవారుజామున గుడారాల వద్దకు వచ్చిన ఓ వ్యక్తిని గుర్తించి పట్టుకుని తాళ్లతో కట్టేశారు. విషయం తెలిసి పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



అనుమానితుడిని విచారిస్తున్న పోలీస్